## క్లుప్తంగా

### క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



మారథాన్ నిర్వహిస్తున్న దృశ్యం

నందికొట్కూరు: క్రీడలలో రాణిస్తే విద్యార్థులకు ఉజ్వల ఉంటుందని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో 2023 క్రీడోత్సవ్ మారథాన్‌ను శ్లోక సీబీఎస్ఈ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పరుగును చైర్మన్ ప్రారంభించారు. ఉదయం 7.30 గంటలకు గవర్నమెంట్ కాలేజీ రోడ్డు, సాయిబాబాపేట, కోటవీధి, ఆర్టీసీ బస్టాండ్ మీదుగా మారథాన్ సాగింది. చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచే క్రీడల వైపు ముందుడు వేయాలన్నారు. విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శాప్ కర్నూలు జిల్లా కో ఆర్డినేటర్ శ్రీనాథ్, రిటైర్డు వ్యాయామ ఉపాధ్యాయులు శంకర్‌రెడ్డి, శ్లోక స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాసరెడ్డి, కవిత, శ్రీదేవి, బసిరెడ్డి డిగ్రీ కళాశాల డైరెక్టర్ రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

### బీరువా బహూకరణ



బీరువా వితరణ చేసిన పూర్వ విద్యార్థి తండ్రి కేశాలును సన్మానించిన ఉపాధ్యాయ బృందం

పగిడ్యాల: 2002–2003 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి కటారి మాదవకృష్ణ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సుమారు రూ.12 వేలు విలువ చేసే 8 అరల బీరువాను బహూకరించారు. శనివారం పాఠశాల హెచ్‌ఎం మధుసూదన్‌రావు సమక్షంలో మాధవకృష్ణ తండ్రి కటారి కేశాలు బీరువాను అందజేశారు. అనంతరం హెచ్‌ఎం, ఉపాధ్యాయులు కేశాలును పూలమాలతో సత్కరించి అభినందించారు. ఉపాధ్యాయులు రషీద్‌మియ్యా, రమణారావు, క్రీడాశ్రీ పీతాంబరరెడ్డి, సీఆర్‌పీ మధునాయుడు, ఖోఖో కోచ్ శివ తదితర సిబ్బంది ఉన్నారు.

### పాఠశాలకు విరాళం



ఆర్థికసాయం అందజేస్తున్న ఎంపీపీ లాలం రమేష్

వెలుగోడు: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌కు ఎంపీపీ లాలం రమేష్ రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. స్కూల్‌లో ఇటీవల కోతుల బెడద అధికమైంది. విషయం తెలుసుకున్న ఎంపీపీ సమస్యను ఎమ్మెల్యే శిల్పా దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు కోతుల బెడద నుంచి రక్షణ చర్యలు తీసుకునేందుకు రూ.10వేలను శనివారం స్కూల్ ప్రిన్సిపాల్ నళినికి అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మోత్కూరు గ్రామ యువ నాయకుడు ఎం.సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### మాల మహానాడు రాయలసీమ లీగల్ సెల్ అధ్యక్షుడిగా చింతలన్న



నియామకపత్రం అందుకుంటున్న చింతలన్న

మహానంది: మండలంలోని తమడపల్లె గ్రామానికి చెందిన దక్క నడిపి చింతలన్నను మాల మహానాడు రాయలసీమ లీగల్ సెల్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య శనివారం నంద్యాలలో జరిగిన కార్యక్రమంలో నియామక పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు లింగస్వామి, మాజీ ఎమ్మెల్యే ఐజయ్య తదితరులు పాల్గొన్నారు.

### వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న గోవింద మాలధారులు

నంద్యాల(వ్యవసాయం): చిన్నచెరువు వద్ద బిల్లలాపురం రస్తాలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీరామ గోవింద ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం గోవింద మాలధారులు వేంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అరటి బోదెలతో నిర్మించిన ఉత్సవ విగ్రహానికి పంచామృతాభిషేకాలు, స్నపన తిరుమంజనసేవ అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. విశేష పూజలు నిర్వహించి మండప పూజ అనంతరం మహామంగళహారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి, అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారిని దీపోత్సవంతో గ్రామోత్సవం జరిపించారు.

# తెరుచుకున్న అంగన్‌వాడీ కేంద్రాలు

- నిర్వహణ బాధ్యతలు సచివాలయ ఉద్యోగులకు
- యథావిధిగా సేవలు

జూపాడుబంగ్లా: జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం ఎంపీడీఓ నూర్జహాన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుమారి, కార్యదర్శి సామేలు, సచివాలయ ఉద్యోగులు సర్పంచ్ మొట్టె బాలస్వామి అధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల తలుపులు తెరిచారు. జూపాడుబంగ్లాలోని ఒకటి నుంచి ఐదు అంగన్‌వాడీ కేంద్రాలు, కాసానగర్ అంగన్‌వాడీ కేంద్రం తాళం తెరచి అందులోని సరుకులను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు లెక్కించి రికార్డులో నమోదు చేశారు. ఎంపీడీఓ, ఐసీడీఎస్ మాట్లాడుతూ జేసీ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల తలుపులు తెరవనున్నట్లు తెలిపారు. చిన్నారుల తల్లిదండ్రులు సోమవారం నుంచి యథావిధిగా పిల్లలను కేంద్రాలకు పంపాలని సూచించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంటు మద్దిలేటి, డిజిటల్ అసిస్టెంటు పావని, సచివాలయ పీఎస్ మణికంఠ, పీఎస్ సామేలు, జీఎస్ఎంకే ప్రమీలకుమారి పాల్గొన్నారు.



కాసానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సరుకులను లెక్కిస్తున్న అధికారులు



ఎం. ఘణపురం సర్పంచ్ ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రం తెరుస్తున్న అధికారులు

**నిర్వహణ బాధ్యతలు సచివాలయ ఉద్యోగులకు**

పగిడ్యాల: జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ బాధ్యతలను ఆయా గ్రామ సచివాలయాల ఉద్యోగులకు అప్పగించినట్లు ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. శనివారం గ్రామ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాలను తెరిపించామన్నారు. ఐదు రోజులుగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు నివరదిక ధర్నా చేపట్టిన్న నేపథ్యంలో కేంద్రాలు మూతపడ్డాయన్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు సచివాలయ ఉద్యోగులే వాటి నిర్వహణ బాధ్యతను పర్యవేక్షిస్తారని వెల్లడించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో రోజువారి ఇచ్చే ఫీడింగ్‌ను హెల్త్ సూపర్‌వైజర్ ప్రత్యక్షంగా పర్యవేక్షించి పలు సూచనలు చేస్తారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగేంద్రయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శేషమ్మ, ఏపీఎం శ్రీనివాసులు, సర్పంచ్‌లు ప్రతాపరెడ్డి, పెరుమాళ్ల శేషన్న, పెద్ద ఆంజనేయులు, పిట్టల శేషమ్మ తదితరులు ఉన్నారు.

**అంగన్‌వాడీ సెంటర్లు పునఃప్రారంభం**

కొత్తపల్లి: మండలంలో ఐదు రోజులుగా మూతబడిన అంగన్‌వాడీ సెంటర్లను ఐసీడీఎస్ అధికారుల సమక్షంలో శనివారం పునఃప్రారంభించామని ఎంపీడీఓ మేరి తెలిపారు. మండలంలోని దుద్యాల, ఎర్రమఠం, కొత్తపల్లి, తదితర గ్రామాలలోని సెంటర్లను ప్రారంభించి తనిఖీలు చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజలి, పంచాయతీ కార్యదర్శి పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

## పథకాలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు పర్వత యుగంధర్ రెడ్డి

మిడుతూరు: అర్హులైన ప్రతి ఒక్కరు కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు పర్వత యుగంధర్ రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని మాసపేట గ్రామంలో సర్పంచ్ షంషూన్ బీ అధ్యక్షతన, కడుమూరులో సర్పంచ్ జీవరత్నం అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కలిగి ఉండటంతో పాటు పథకాల లబ్ధితో అభివృద్ధి పథంలోకి రావాలని ఆకాంక్షించారు. ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వంగూరు జనార్దన్ రెడ్డి, ఈఓఆర్డీ ఫక్రుద్దీన్, ఆత్మ బీటీఎం ఉమామహేశ్వరి, ఏపీఎం సుబ్బయ్య, ఏపీఓ జయంతి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ పథకాలపై అవగాహన ఉండాలి**

మహానంది: కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని బండిఆత్మకూరు మండల ఉపాధి హామీ పథకం అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ వసుధారెడ్డి అన్నారు. ఈర్నపాడులో శనివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు గ్రామస్తులను ఆకట్టుకున్నాయి.

## నేడు ఎమ్మెల్యే శిల్పా పర్యటన

ఆత్మకూరు: పట్టణంలో ఆదివారం స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి శనివారం తెలిపారు. ఎమ్మెల్యే పట్టణంలోని చక్రం హోటల్ వద్ద నూతన ఫంక్షన్‌హాల్‌ను ప్రారంభిస్తారని, కార్యకర్తలకు అందుబాటులో ఉండి, వివిధ సమస్యలపై చర్చిస్తారని వెల్లడించారు. కార్యక్రమాలకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

## కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నందికొట్కూరు: ఆర్టీసీలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు గోపాలకృష్ణ కోరారు. శనివారం పట్టణంలోని ఆర్టీసీ డీఎం నాగేశ్వరరావుకు కార్మికుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులకు సర్క్యులర్ ప్రకారం జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐలో కుటుంబ సభ్యులను చేర్చడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు సంవత్సరానికి పీఎఫ్, ఈఎస్ఐ రసీదులు ఇవ్వాలని, ప్రతి నెల 10వ తేదీ లోపు జీతాలు చెల్లించాలని కోరారు. ఆ సంఘం నాయకులు నాగన్న, ఆంజనేయులు, రామసుబ్బమ్మ, లక్ష్మమ్మ, నాగేంద్రమ్మ పాల్గొన్నారు.

## వాణిజ్య విభాగాన్ని మరింత బలోపేతం చేస్తాం

వెలుగోడు: కర్నూలు ఉమ్మడి జిల్లాలో వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగాన్ని మరింత బలోపేతం చేస్తామని ఆ సంఘం జిల్లా ఇన్‌చార్జ్ బళ్లాని వెంకట సత్యనారాయణ అన్నారు. పార్టీ అధినేత, సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు బళ్లాని వెంకట సత్యనారాయణను ఇటీవల వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభంగా కర్నూలు, నంద్యాల జిల్లాల ఇన్‌చార్జ్‌గా నియమించారు. అయన్ను పలువురు అభినందించారు. శనివారం నంద్యాల జిల్లా వాణిజ్య విభాగం నూతన కమిటీని ఎన్నుకున్నట్లు బళ్లాని వెంకట సత్యనారాయణ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం కల్పిస్తామన్నారు. రాష్ట్రంలో ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డే ముఖ్యమంత్రిగా కావాలని కోరుకుంటున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్రవ్యాప్తంగా విజయదుందుభి మోగించనుందని ధీమ వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పార్టీలు, పచ్చపత్రికలు ఎన్ని కుట్రలు పన్నినా, ఎన్ని అవాస్తవాలు ప్రచారం చేసినా ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని స్పష్టం చేశారు. తనపై నమ్మకం ఉంచి వాణిజ్య విభాగం జోన్–7 ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్‌గా నియమించడం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుప్పం ప్రసాద్, పార్టీ నాయకులకు కతజ్ఞతలు తెలిపారు.

## సస్యరక్షణ చర్యలు చేపట్టండి

నంద్యాల (సెంట్రల్): జిల్లా వ్యాప్తంగా రబీలో సాగైన పలు పంటల్లో మేలైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు రైతన్నలకు సూచించారు. ముఖ్యంగా కంది, వరి, మొక్కజొన్న, శనగ, వేరుశనగ పంటలకు సంబంధించి తెగుళ్ల నివారణకు పలు పరిష్కారాలను వివరించారు. వాతావరణంలో అధిక తేమ వల్ల ఈ పంటలకు పలు శిలీంద్ర తెగుళ్లు ఆశించే అవకాశం ఉన్నందున రైతులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు.

## నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు



కరెంట్‌పోల్ ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్‌కో అధికారులు

ఆత్మకూరు: మండలంలోని కొత్తరామాపురంలో శనివారం నూతన కరెంట్ స్తంభాలను ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శివరాం మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన సమ యంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి పలువురు గ్రామస్తులు గ్రామంలో విద్యుత్ స్తంభాల కొరత ఉందని, రాత్రి వేళ ఇబ్బంది పడుతున్నామని విన్నవించారన్నారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఈ మేరకు ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారని చెప్పారు. విద్యుత్ స్తంభాలు రావడంతో వీధి దీపాలు కూడా బిగిస్తామని వెల్లడించారు. సమస్యలు పరిష్కరించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## 19న ఫిమేల్ థెరపిస్ట్ పోస్ట్‌కు ఇంటర్వ్యూ

నంద్యాల టౌన్: స్థానిక సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని ఆయుర్వేద వైద్యశాలలో ఫిమేల్ థెరపిస్ట్ పోస్ట్‌కు ఈ నెల 19వ తేదీన ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్ యశోద శనివారం తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులై, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండి పంచకర్మ సర్టిఫికెట్ కోర్సు చేసిన మహిళా అభ్యర్థులు ధ్రువ పత్రాలతో మంగళవారం ఉదయం 10 నుంచి 12 గంటల మధ్య సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని ఆయుష్ విభాగంలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

## సచివాలయ సిబ్బందిపై దాడులు హేయం

నంద్యాల(అర్బన్)/బొమ్మలసత్రం: అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ సమ్మె నేపథ్యంలో వారికి ప్రత్యామ్నాయంగా సచివాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తుంటే వారిపై దాడులకు పాల్పడటం హేయమైన చర్యని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ మహిళా పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు మహాలక్ష్మి,వర్కింగ్ ప్రెసిడెంట్ చైత్ర శ్రీజారెడ్డి శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ సమ్మె కారణంగా బాలింతలు, చిన్నారులకు ఇబ్బందులు ఎదురవకుండా ప్రభుత్వం వారికి ప్రత్యామ్నాయంగా సచివాలయ సిబ్బందికి పనులు అప్పజెప్పిందన్నారు. సచివాలయ ఉద్యోగులు ప్రజలకు మంచి చేస్తుండగా కొన్ని చోట్ల దాడులకు పాల్పడుతూ, దురుసుగా ప్రవర్తించటం అంగన్‌వాడీ వర్కర్స్‌కు సరైందికాదని పేర్కొన్నారు.

## విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం వినియోగదారుల క్లబ్ ఆధ్వర్యంలో వాణిజ్య శాస్త్రం విభాగంలో జాతీయ వినియోగదారుల వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీల్లో 31మంది విద్యార్థులు పాల్గొన్నట్లు ప్రిన్సిపాల్ శశికళ, క్లబ్ కన్వీనర్ విజయలక్ష్మి, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ శైలజారాణి తెలిపారు. వారు మాట్లాడుతూ 18న జిల్లా స్థాయిలో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు 19న బహుమతులు అందజేస్తామని చెప్పారు.

## పనికి వద్దు.. బడి ముద్దు

పగిడ్యాల: బడిఈడు పిల్లలందరినీ బడికి పంపాలని, పనికి తీసుకెళ్లరాదని లక్ష్మాపురం ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాల పీఎంసీ చైర్మన్ ఎం.మహబూబ్ బాషా పిలుపునిచ్చారు. శనివారం హెచ్‌ఎం అబుఖాసీం అధ్యక్షతన తల్లిదండ్రుల కమిటీ సమావేశం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు పథకం కింద ప్రభుత్వ బడులను కార్పొరేట్ పాఠశాలలుగా తయారు చేశారన్నారు. బడిఈడు కలిగిన ప్రతి పిల్లవాడు బడిలో ఉండాలని, విద్య కోసం పెట్టే పెట్టుబడి భవిష్యత్‌కు పెట్టుబడిగా సీఎం చెప్పడం ఎంతో అభినందనీయమన్నారు. పదవ తరగతి ఫెయిల్/పాస్ అయి ఇంటికే పరిమితన పిల్లలను కూడా పై తరగతుల్లో చేర్పించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలియజేశారు. అనంతరం గ్రామంలో విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు.



విద్యార్థులతో ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు, కమిటీ చైర్మన్ మహబూబ్‌బాష

## ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోండి

జూపాడుబంగ్లా: రబీ సీజన్‌లో పంటలు సాగుచేసిన రైతులు వెంటనే ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి సూచించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలం వ్యాప్తంగా రబీ సీజన్ సాధారణ సాగు విస్తీర్ణం 4,423హెక్టార్లు కాగా అందులో ఇప్పటిదాకా 2,802హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగుచేసినట్లు తెలిపారు. జొన్న, వేరుశనగ, పప్పుశనగ, ఉల్లి, మినుము, కంది, పెసర, తదితర పంటలు వేశారన్నారు. వీటిని సత్వరమే గ్రామాల్లోని ఆర్బీకే సిబ్బందిని సంప్రదించి ఈక్రాప్ బుకింగ్ చేయించుకోవాలని తెలిపారు. నాలుగు రోజుల క్రితం ఈక్రాప్ బుకింగ్ ప్రారంభించగా ఇప్పటిదాకా ఆర్బీకేల సిబ్బంది 500హెక్టార్ల లో నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ క్రాప్ బుకింగ్ చేయించుకొన్న రైతులకు మాత్రమే పంటనష్ట పరిహారం, గిట్టుబాటు ధరకు ధాన్యం విక్రయించుకునే వెసలుబాటు ఉంటుందన్నారు.



ఈ క్రాప్ బుకింగ్ చేస్తున్న వీఏఏ అబ్దుల్లా

## డిజిటల్ తరగతులతో ఉత్తమ ఫలితాలు



డిజిటల్ బోర్డు ద్వారా బోధిస్తున్న ఏఎంఓ

మిడుతూరు: విద్యార్థినులకు డిజిటల్ బోర్డుల ద్వారా సాంకేతిక విద్యను అందిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని నంద్యాల జిల్లా ఏఎంఓ లలితకుమారి అన్నారు. శనివారం స్థానిక కస్తూర్బా బాలికల విద్యాలయంలో విద్యార్థులకు డిజిటల్ క్లాస్‌ల ద్వారా బోధనా తీరును పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. డిజిటల్ బోర్డుల ద్వారా బోధన సాగిస్తే సులభరీతిలో అర్థం చేసుకుంటారని చెప్పారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మాథ్స్, జీవశాస్త్రం సబ్జెక్టులకు సంబంధించిన పాఠ్యాంశాలను డిజిటల్ బోర్డుల ద్వారా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యా ప్రమాణాల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం లక్షలు వెచ్చించి డిజిటల్ తరగతులకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. టాపర్‌గా నిలిచిన విద్యార్థినులను ప్రత్యేకంగా అభినందించారు. ఎంఈఓ-2 శ్రీనాథ్, ఇన్‌చార్జ్ ఎస్ఓ ఉమాగైర్వాణి పాల్గొన్నారు.

## వివేకానంద స్కూల్‌కు ఎడ్యుకేషన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న కరస్పాండెంట్ గోపాల్

నందికొట్కూరు: పాములపాడులోని వివేకానంద విద్యా విహార్ ఇంగ్లిషు మీడియం హైస్కూల్‌కు నేషనల్ 4వ ఎడ్యుకేషన్ ఈటీటెక్ ఎక్సలెన్సీ అవార్డు దక్కిందని స్కూల్ కరస్పాండెంట్ గోపాల్ తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ కన్వెక్షన్ హాల్‌లో జాతీయస్థాయి బ్రెయిన్ ఫీడ్ ఎక్సలెన్సీ 2023–24 అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. కార్యక్రమంలో పాములపాడు మండల కేంద్రంలోని వివేకానంద స్కూల్ కరస్పాండెంట్ గోపాల్ అవార్డును అందుకున్నారు. రూరల్ విద్యా విధానంలో నంద్యాల జిల్లాలో తమ స్కూల్ అవార్డు రావడం గర్వంగా ఉందన్నారు.

## ఐదో రోజు అంగన్‌వాడీల నిరసన



వెలుగోడులో ఎమ్మెల్సీ షేక్ సాబ్జి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అంగన్‌వాడీలు

శ్రీశైలంప్రాజెక్ట్: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తలపెట్టిన నిరవధిక సమ్మె శనివారం 5వ రోజుకు చేరుకుంది. అంబేడ్కర్ సెంటర్ నుంచి అంగన్‌వాడీలు కళ్లకు గంతలు కట్టుకుని సున్నిపెంట వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కనీస వేతనాన్ని పెంచాలని, యాప్‌ల భారాన్ని తొలగించాలని, రిటైర్మెంట్ అలవెన్స్‌లు కల్పించాలని కోరుతూ వారు సమ్మె చేపట్టారు. అంగన్‌వాడీలకు ఏఐటీయూసీ నాయకులు ఓబులయ్య, నాగిరెడ్డి, వాల్మీకి సంఘం నాయకులు మల్లికార్జున మద్దతును తెలియజేశారు.

వెలుగోడు: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.రామదాస్ డిమాండు చేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్ వాడీలు మోకాళ్లపై కూర్చొని కళ్లకు నల్లగుడ్డ కట్టుకొని నిరసన తెలిపారు. వారికి సీఐటీయూ మండల అధ్యక్ష కార్యదర్శులు వి నాగమోహన్, టి శ్రీనివాసులు, జిల్లా ఆవాజ్ నాయకులు మహమ్మద్ రఫీ తదితరులు మద్దతు తెలిపారు. అనంతరం పీడీఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి మృతికి సంతాపం తెలియజేస్తూ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

ఆత్మకూరు: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు శనివారం కళ్లకు గంతలు కట్టుకొని, మోకాళ్లపై కూర్చొని నిరసన చేపట్టారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్స్ యునియన్ నాయకులు మంజుల, లక్ష్మీదేవి, ప్రమీలమ్మ, సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు రజాక్, కార్యదర్శి రామ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు చేపట్టిన సమ్మె ఐదో రోజుకు చేరుకుంది. శనివారం అంగన్‌వాడీలు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట యూనియన్ జిల్లా నాయకురాలు ఈ.హరిత, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి స్వాములు, సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి రామ్ నాయక్‌ల ఆధ్వర్యంలో కళ్లకు నల్ల గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ అవరణలోని గాంధీ విగ్రహం వరు ర్యాలీ నిర్వహించి మానవ హారంగా ఏర్పడ్డారు.

జూపాడుబంగ్లా: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట కేజీరోడ్డుపై అంగన్‌వాడీ వర్కర్లు కళ్లకు గంతలు కట్టుకొని మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. వెంకటరమణమ్మ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు సన్మానం



విక్టర్ ప్రసాద్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నంద్యాల(అర్బన్): రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్‌ను వైఎస్సార్‌సీపీ నాయకులు సత్కరించారు. నంద్యాల మండలం పెద్ద కొట్టాల గ్రామంలో ఏర్పాటు చేసిన బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకు ముందు ఆర్ అండ్ బీ అతిథి గృహంలో విడిది చేసిన ఆయనను జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య, ఆర్డీఓ శ్రీనివాసులు మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కార్యదర్శి కారు రవికుమార్, మాజీ కౌన్సిలర్ అనిల్ అమృతరాజ్, మనోజ్ కుమార్, సేవాదల్ జిల్లా అధ్యక్షులు ప్రేమ్‌కుమార్ శాలువ, పూలమాలలతో సత్కరించారు.

## 'ఆడుదాం ఆంధ్ర' ట్రయల్ పోటీలు ప్రారంభం

నంద్యాల(న్యూటౌన్): జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సంద్యాల ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్ర ట్రయల్ పోటీలు శనివారం సరస్వతి నగర్ వార్డు సచివాలయంలో నిర్వహించినట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రాజు తెలిపారు. ఆయన మాట్లాడుతూ వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీల ట్రయల్స్ నిర్వహించామరన్నారు. 14వ వార్డు కౌన్సిలర్ సోమశేఖర్ రెడ్డి, ప్రిన్సిపాల్ ద్రాక్షావలి ప్రారంభించారు.



ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

# కమ్ముకున్న పొగమంచు

- మంచు దుప్పట్లో ఆత్మకూరు
- వణికిస్తున్న చలి
- ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్న జనం



పంటపొలాల్లో కమ్మేసిన పొగమంచు

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణ శివారు ప్రాంతంలో శనివారం చలి వణికిస్తోంది. ఎటుచూసినా పొగమంచు కమ్మేస్తోంది. మంచు తెరల్లోనే బాటసారులు మార్నింగ్ వాక్‌కు వెళ్లేవారు, వాహనదారులు ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించేందుకు ఇబ్బందులు పడ్డారు. పంటపొలాలలో మంచుదుప్పటి ఉదయం 8 గంటలు దాటినా వీడడంలేదు. సాయంత్రం 7 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం వరకు చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఇళ్లనుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. స్కూళ్లకు వెళ్లే విద్యార్థులు స్వెటర్లు ధరించాల్సి వస్తోంది. ఇదిలా ఉండగా మంచి ఎక్కువైతే పంట పొలాల్లో సాగు చేసే మినుము, శనగ పంటలు దెబ్బతింటాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

## ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించాలి

నంద్యాల(సిటీ): ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఫాస్ట్ ట్రాక్ ఫుడ్ సేఫ్టీ ట్రైనింగ్ సెంటర్ నిర్వాహకులు ప్రసాద్ సూచించారు. శనివారం పట్టణంలోని ఆయుష్ యోగా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. పట్టణంలో ప్రజలకు అందించే తినుబండారాలను నాణ్యతగా ఉండాలన్నారు. ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన, హైజెనిక్ ఆహారం అందించి ప్రజల ఆరోగ్యాని కాపాడాలన్నారు. శిక్షణ తీసుకున్న హోటల్, తినుబండారాల నిర్వాహకులకు సర్టిఫికెట్లు అందించారు. ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్ సాయి, వంశీ, లలిత, సుజాత పాల్గొన్నారు.

## 29 వరకు న్యాయవాదుల విధుల బహిష్కరణ

నంద్యాల(వ్యవసాయం): భూ హక్కు చట్టాలకు వ్యతిరేకంగా నంద్యాల జిల్లా న్యాయవాదులు ఈనెల 29వ తేదీ వరకు కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గోళ్ల జయకృష్ణ, ప్రతాపరెడ్డి శనివారం తెలిపారు. స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఈ చట్టం వల్ల పేదలకు అన్యాయం జరుగుతుందని, భూ హక్కు చట్టాలపై సివిల్ కోర్టుకు ఎటువంటి పరిధి ఉండదన్నారు. ఈ చట్టాన్ని న్యాయవాదులు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారని చెప్పారు.